

సేంద్రియ సాగులో 'చక్రవర్తి'
సేంద్రియ పద్ధతిలో పంటలు పండిస్తున్న ఓ యువరైతు ఆదర్శ వ్యవసాయంతో ఆకట్టుకుంటున్నాడు. 8లో▸



పనిచేయని కెమెరాలు..
పట్టణంలోని పలు చోట్ల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయడం లేదు. దీంతో కేసుల ఛేదనలో జాప్యం జరుగుతోంది. 8లో▸



సమీక్షలెందుకు?
ప్రజా సమస్యలు పరిష్కరించలేని సమావేశాలు ఎందుకు నిర్వహిస్తున్నారని పలువురు ప్రజాప్రతినిధులు అధికారులపై మండిపడ్డారు. 9లో▸

వెనకబాటు ఇంకెన్నాళ్లు?

- సమష్టిగా పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలి
- పోక్సో చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి
- బాల కార్మిక వ్యవస్థను రూపుమాపాలి
- హైకోర్టు న్యాయమూర్తి ఎంజీ ప్రియదర్శిని



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి ప్రియదర్శిని

వికారాబాద్: 'వెనక బడిన జిల్లా అనే పదాన్ని మార్చేయండి' అని హైకోర్టు న్యాయమూర్తి ఎంజీ ప్రియదర్శిని అన్నారు. వికారాబాద్ జిల్లా కోర్టులో రెవెన్యూ, పోలీసు, మాతా శిశు సంక్షేమ, విద్య, వైద్య తదితర శాఖల అధికారులతో శనివారం ఆమె కో ఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంకా ఎంతకాలం వెనకబడిన జిల్లా అందామని ప్రశ్నించారు. అందరి సహకారంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దామని పిలుపునిచ్చారు. బాల్య వివాహాలు, బాలకార్మికులు, పోక్సో చట్టం, భిక్షాటన, డ్రగ్స్ కల్చర్ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. శాఖలవారీగా బాలలు, బాలికలు, మహిళలు వారి హక్కుల పరిరక్షణ, భద్రత కోసం చేపడుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. పార్లమెంటులో చేసిన చట్టాలను అమలు చేయటం అధికారుల బాధ్యత అని.. వీటిని ఉల్లంఘిస్తే శిక్షలు వేసే పని న్యాయ వ్యవస్థది అని తెలిపారు. బాలికల అక్రమ రవాణాపై దృష్టిసారించాలని పోలీసులకు సూచించారు. ట్రాన్స్‌జెండర్లు వివక్షకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

- పోక్సో కేసుల్లో బాధితులను ఎగ్జామిన్ చేయటం కోసం పోలీసులు వారిని ఆస్పత్రులకు తీసుకువెళ్తే సకాలంలో పరీక్షలు చేయకపోవడంతో ఆధారాలు చెరిగిపోతున్నాయి.. ఉదయం నుంచి సాయంత్రం వరకు వారిని వెయిట్ చేయిస్తున్నారు అని న్యాయమూర్తి తెలిపారు. ఈ విషయమై డీఎంహెచ్ఓ పాల్వన్‌కుమార్ స్పందిస్తూ గైనకాలజిస్టులు అందుబాటులో ఉండే ఏరియా ఆస్పత్రులలోనే ఈ పరీక్షలు నిర్వహిస్తారని, ఇవి వైద్యవిధాన పరిషత్ పరిధిలోకి వస్తాయని తెలిపారు.
- జిల్లాలో బడి మానేసిన చిన్నారులు ఎంత మంది ఉన్నారు..? వీరిని స్కూళ్లలో చేర్పించేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించగా.. జిల్లాలో 632 మంది బాలకార్మికులు ఉండగా వీరిలో 400 మంది బాలికలు ఉన్నారని డీఈఓ రేణుకాదేవి సమాధానం ఇచ్చారు. డ్రాపౌట్స్‌ను తగ్గించేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు.
- బాల్యవివాహాలు ఎక్కువగా వికారాబాద్ జిల్లాలోనే జరుగుతున్నాయని.. వీటిని ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నించగా.. జిల్లాలో 126 బాల్య వివాహాలను ముందస్తుగా గుర్తించి ఆపేశామని, బాల్యవివాహాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని మహిళా శిశు సంక్షేమాధికారి లలితకుమారి న్యాయమూర్తికి వివరించారు.
- పోక్సో కేసులు, బాల్య వివాహాలపై పోలీసు శాఖ చర్యలపై ప్రశ్నించగా.. ఇంట్లోంచి వెళ్లిపోయిన, మైనర్ వివాహాల ఫిర్యాదులపై వెంటనే కేసులు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నామని డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు.
- పోక్సో, అట్రాసిటీ బాధితులకు అందుతున్న సాయం, పరిహారంపై ఆర్డీఓ విజయకుమారిని ప్రశ్నించగా సకాలంలో పరిహారం అందేలా సంబంధిత శాఖలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు.

ప్రత్యేక చొరవ తీసుకోవాలి..

భిక్షాటన చేసే పిల్లలకు పునరావాసం కల్పించి, బడికి వెళ్లేలా చూడాలన్నారు. అనాథ బాలల దత్తతపై జాగ్రత్తలు తీసుకోవాలని, డ్రగ్స్ విక్రయించే ప్రాంతాలపై నిఘా ఉంచాలని సూచించారు. జిల్లా న్యాయమూర్తి సుదర్శన్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ డీబీ శీతల్, న్యాయమూర్తి శ్రీకాంత్, బార్ అధ్యక్ష, కార్యదర్శులు మాధవరెడ్డి, రమేశ్‌గౌడ్, డీఆర్వో అశోక్, ఏఎస్పీ మురళీధర్‌రావ్, డీఎస్పీలు సత్యనారాయణ, కరుణాసాగర్, శేఖర్‌గౌడ్ ఉన్నారు.

న్యూస్‌రీల్

పదోన్నతులు కల్పించాలి



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న భాషా పండితులు

వికారాబాద్ అర్బన్: ప్రభుత్వం ఇచ్చిన జీవోలను అమలు చేస్తూ భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలని ఆర్‌యూపీపీటీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ఎజాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్, గాంధీ విగ్రహాలకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపడుతున్న ప్రభుత్వం లాంగ్వేజ్ పండిట్లను విస్మరించిందన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ భాషా పండితులకు పదోన్నతులు ఇస్తామని చెప్పినట్లు గుర్తు చేశారు. అందుకే 110ను ప్రభుత్వం విడుదల చేసినా.. అమలుకు మాత్రం నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. స్కూల్ అసిస్టెంట్లతో సమానంగా పని చేయించుకుంటున్న ప్రభుత్వం తమను చిన్నచూపు చూస్తోందన్నారు. ఇప్పటికైనా స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు.

72,927 మందికి నేత్ర పరీక్షలు



కంటి వెలుగులో భాగంగా పరీక్షలు చేస్తున్న వైద్యారోగ్య శాఖ సిబ్బంది

- ముమ్మరంగా సాగుతున్న 'కంటి వెలుగు'
- 12,185 మందికి రీడింగ్ గ్లాసెస్ అందజేత
- ఆపరేషన్లు అవసరమైన వారి వివరాల నమోదు

వికారాబాద్ అర్బన్: కంటి వెలుగు శిబిరాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గత నెల 19న ప్రారంభమైన కార్యక్రమంలో 42 బృందాలు నిత్యం పరీక్షలు చేస్తున్నాయి. ఇప్పటి వరకు 72,927 మంది టెస్టులు చేయించుకున్నారు. జిల్లాలోని 49 గ్రామాలు, మున్సిపాలిటీల్లోని 16 వార్డులకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. వీరిలో 19,636 మందికి దగ్గరి చూపు సమస్య ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఇందులో ఇప్పటి వరకు 12,185 మందికి రీడింగ్ గ్లాసెస్ అందజేశారు. మరో 7,451 మందికి కళ్లజోళ్లు ఇచ్చేందుకు ఆర్డర్ చేశామని వైద్యారోగ్య శాఖ అధికారులు తెలిపారు. కంటి సమస్య అధికంగా ఉన్న వారిలో.. తీవ్రత ఏ స్థాయిలో ఉందనే విషయాన్ని గుర్తించి, ప్రిస్క్రిప్షన్ అద్దాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వీరికి కూడా అవసరమైన కళ్లద్దాలు తెప్పించేందుకు ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపరుస్తున్నారు. చాలాకాలంగా కంటి సమస్యలు ఎదుర్కొంటూ ఆపరేషన్ తప్పనిసరైన వారి వివరాలను నమోదు చేసి పెట్టుకుంటున్నారు. ఈ జాబితాను జిల్లా ఆస్పత్రికి పంపించనున్నారు.

బదిలీలపై కసరత్తు



దరఖాస్తులను పరిశీలిస్తున్న సీనియర్ ఉపాధ్యాయులు

- కొనసాగుతున్న ఉపాధ్యాయుల వివరాల పరిశీలన
- ట్రాన్స్‌ఫర్ల కోసం 1,200 మంది దరఖాస్తు
- 7వ తేదీలోపు పాయింట్లు కేటాయించే అవకాశం

వికారాబాద్ అర్బన్: ఉపాధ్యాయ బదిలీల కసరత్తు కొనసాగుతోంది. ఇందుకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను శుక్రవారం నుంచి పరిశీలిస్తున్నారు. జిల్లాలో 19 మండలాలకు చెందిన హార్డ్ కాపీలు డీఈఓ కార్యాలయాలకు చేరుకున్నాయి. సుమారు 20 మంది సీనియర్ ఉపాధ్యాయులు, హెచ్ఎంలు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. బదిలీ దరఖాస్తులు సుమారు 1,200 వరకు ఉండటంతో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా పరిశీలన అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎక్కడైనా తప్పులు ఉన్నట్లు తేలితే డీఈఓ దృష్టికి తీసుకెళ్లి సరి చేసే ప్రయత్నం చేస్తున్నారు. దరఖాస్తుల పరిశీలన పూర్తయితేనే ఉపాధ్యాయులకు పాయింట్స్ కేటాయించే అవకాశం ఉంటుంది. ఈనెల 7వ తేదీలోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉండటంతో సంబంధిత అధికారులు ఈ అంశంపై దృష్టిసారించారు. ఇదివరకు స్పౌజ్ కేటగిరీ కింద లబ్ధిపొందిన విషయాన్ని పరిశీలించి ఆన్‌లైన్‌లో ఎంటర్ చేస్తున్నారు. ఎస్జీటీలుగా కొనసాగుతూ మరోసారి నిర్వహించిన డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ సాధించిన వారికి ఎస్జీటీ సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఎస్జీటీగా ఉంటూ స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి పొందిన వారి సర్వీస్‌ను మాత్రమే లెక్కలోకి తీసుకుంటున్నారు. బదిలీకోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల ఎన్‌టైటిల్మెంట్ పాయింట్లతో కూడిన లిస్టును ఈనెల 7న ఆన్‌లైన్‌లో పెట్టనున్నారు. ఆతర్వాత ఉపాధ్యాయులు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలకు ఆప్షన్స్ ఇచ్చుకుంటారు.

క్లుప్తంగా

7న లబ్ధిదారుల ఎంపిక

యాలాల: మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు ఈ నెల 7న లబ్ధిదారుల ఎంపిక చేయనున్నట్లు ఎంపీడీఓ పుష్పలీల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ హాలులో ఉదయం 11 గంటలకు ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. లాటరీ పద్ధతిన ఎంపిక చేస్తామన్నారు. అదే రోజు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలపై ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

7న ఉపాధి హామీ సోషల్ ఆడిట్‌పై ప్రజావేదిక

బంట్వారం: ఉపాధి హామీ పనుల సోషల్ ఆడిట్‌పై ఈనెల 7న మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాలయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 2020 నుంచి మార్చి 2022 వరకు జరిగిన ఉపాధి పనులు చేపట్టిన గ్రామాల్లో సామాజిక తనిఖీ కొనసాగుతోందని పేర్కొన్నారు. ఇందులో వెల్లడైన వేతన చెల్లింపులు, పనుల నాణ్యత, మస్టర్ల నిర్వహణ వివరాలను ఆడిట్ బృందం ప్రతినిధులు ప్రజావేదికలో నివేదిస్తారని తెలిపారు. సంబంధిత సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులు ఉదయం 10.30 గంటలకు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

ఎమ్మెల్సీ నివాళి

బషీరాబాద్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ గుండేపల్లి కళావతి మృతదేహానికి ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన మండల నాయకురాలు మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. ఆమె భర్త బిచ్చప్ప చేసిన సేవలు కూడా మరువలేనివన్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ప్రగాఢసానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కరణం పురుషోత్తం రావు, ఖాలీద్, నీళ్లపల్లి సుధాకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రాందాస్, వెంకటయ్య, శ్రీకాంత్‌రెడ్డి, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా..

ఇద్దరికి గాయాలు

కొడంగల్ రూరల్: ఆటో బోల్తాపడిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన పట్టణ శివారులో శనివారం సాయంత్రం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బొంరాస్‌పేట మండలం రేగడిమైలారం గ్రామానికి చెందిన ఆటోలో రేగడిమైలారం, మూడుమామిళ్లతండాకు చెందిన మాధవి, మదారమ్మ, సక్రి, బీమ్లా, రాంజీలతో ఆటో డ్రైవర్ అశోక్ కొడంగల్‌కు బయలుదేరాడు. ఈ క్రమంలో పట్టణశివారులో అదుపుతప్పి పక్కనే ఉన్న గుంతలో బోల్తాపడింది. ప్రయాణికులకు తీవ్ర గాయాలు కావడంతో కొడంగల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవిగౌడ్ తెలిపారు.

గ్రూప్స్ కోసం ఉచిత శిక్షణ

సాక్షి రంగారెడ్డి జిల్లా: ఎస్సీ స్టడీసర్కిల్‌లో గ్రూప్స్–2, 3, 4, తదితర పోటీ పరీక్షలకు మూడు నెలలపాటు (నాన్ రెసిడెన్షియల్) ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు www. tsstucdycircle. co. in వెబ్‌సైట్‌లో సంప్రదించాలి. ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 4, 5 తేదీల్లో రంగారెడ్డి జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్ కేంద్రంలో సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ జరుగుతుంది. వివరాలకు. 93903 51016, 84668 52217 నంబర్లను సంప్రదించాలి.

సేంద్రియ సాగులో చక్రవర్తి

- ఆర్గానిక్ పంటలు పండిస్తూ
- ఆదర్శంగా నిలుస్తున్న ఓ ఇంజనీరు

మోమిన్‌పేట: ఓ యువరైతు సేంద్రియంతో సాగు చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. రుచి, శుచి గల ఆహారం కేవలం సేంద్రియ ఎరువులతోనే సాధ్యమని ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు గ్రహించి ఆచరణలో పెట్టారు. సమాజంలో కొంత మందికైనా నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సంకల్పంతో ఆర్గానిక్ పద్ధతిలో పంటలను పండిస్తున్నారు. నాలుగేళ్లగా పంటలు సాగు చేస్తూ స్నేహితులకు, కాలనీవాసులకు ఉత్పత్తులను అందిస్తున్నారు. మండల పరిధిలోని మేకవనంపల్లికి చెందిన చక్రవర్తి సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా హైదరాబాదులో స్థిరపడ్డారు. పూర్తిగా ఆర్గానిక్ వ్యవసాయం చేయాలన్న సంకల్పంతో స్వగ్రామంలో 20 ఎకరాల వరకు కొనుగోలు చేశారు. మామిడి, జామ పండ్ల తోటలతో పాటు శ్రీగంధం, నల్ల గంధం చెట్లను పెంచుతున్నారు. ఆదే తోటలో 30 ఆవులు, 300 గొర్రెల పోషణ చేస్తున్నారు. బ్లాక్ రైస్, రెడ్ రైస్‌లను పండిస్తున్నారు. రసాయనిక ఎరువులు, మందులను ఏ మాత్రం వినియోగించకుండా పూర్తిగా ఆర్గానిక్ ద్వారానే పంటలు పండిస్తున్నారు. పంచగవ్య, పంచామృతం తయారు చేసి పంటలకు అందిస్తున్నారు.

చిరుధాన్యాల సాగు..

చిరు ధాన్యాలను పండించేందుకు సదాశివపేట మండల పరిధిలో 100 ఎకరాలను కౌలుకు తీసుకొని జొన్న, కంది, కొర్రలు, ఊదలు, తెల్ల కుసుమల పంటను సాగు చేస్తున్నారు. మండల పరిధిలోని అంరాధి కలాన్ గ్రామంలో మరో 30ఎకరాలు కౌలుకు తీసుకొని పూర్తిగా అర్గానిక్ పద్ధతిలో కూరగాయలు, కరివేపాకు, తీగ జాతి కూరగాయలు, అకుకూరలను పండిస్తు హైదరాబాదుకు సరఫరా చేస్తున్నారు.


ఆర్గానిక్ ద్వారా కరివేపాకు సాగు

బీఫాం యాప్ ద్వారా...

బీఫాం యాప్ ద్వారా కొనుగోలు దారులను సభ్యులుగా చేర్చుకొని వారికి అవసరమైన కూరగాయలు, అకుకూరలను సరఫరా చేస్తున్నారు. ఈ యాప్‌లో చేరిన సభ్యులకు తెల్లకుసుమ నూనె, కంది పప్పు, కొర్రలు, ఊదలు, సీజన్‌లో మామిడి పండ్లు, జామ కాయలను సరఫరా చేస్తున్నారు. అర్గానిక్ పద్ధతిలో పండించడం వలన రుచి, శుచి ఉన్నాయని కొనుగోలుదారులు పేర్కొంటున్నారని ఆయన తెలిపారు.

పంచామృతంతోనే సాగు

మామిడి, జామ పండ్ల తోటలు, ఆకుకూరలు, కరివేపాకు, తీగజాతి కూరగాయలను పూర్తిగా పంచగవ్య, పంచామృతం ద్వారానే పండిస్తున్నాం. ఆలుగడ్డను సాగు చేస్తే బస్తాకు పది బస్తాల దిగుబడి వచ్చింది. బీఫాం యాప్ ద్వారా 200 మంది కొనుగోలు దారులు సభ్యత్వం తీసుకొన్నారు. కొన్ని కుటుంబాలకైనా ఆర్గానిక్ నిత్యావసర సరుకులను అందించాలన్నదే నా బలమైన కోరిక.

– రైతు చక్రవర్తి, మేకవనంపల్లి



ధారూరులో కేంద్ర బృందం పర్యటన

- పలు అభివృద్ధి పనుల పరిశీలన
- నాణ్యతపై సంతృప్తి వ్యక్తంచేసిన సభ్యులు

ధారూరు: జాతీయ స్థాయి పర్యవేక్షణ బృందం శనివారం ధారూరు మండలంలో పర్యటించింది. మండలంలోని నాగారం, అంతారం, నాగసమందర్ గ్రామాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను టీం సభ్యులు తనిఖీ చేశారు. అనంతగిరి చివరి గుట్ట కేరెళ్లి నుంచి జైదుపల్లి, నాగారం గ్రామాల మధ్య ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద నిర్మించిన బీటీ రోడ్డును పరిశీలించారు. నాగసమందర్‌లో ఉపాధిహామీ పథకం కింద నిర్మించిన ఫార్మేషన్ రోడ్డు, పశువుల షెడ్డు, అంతారంలోని బృహత్ పల్లె ప్రకృతి వనం, ఉద్యాన ప్లాంటేషన్, ఇంకుడు గుంతలు, క్రీడా ప్రాంగణాన్ని తనిఖీ చేశారు. సర్పంచు నర్సిరెడ్డితో మాట్లాడి పనుల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఈజీఎస్ సిబ్బంది, గ్రామ కార్యదర్శులను అడిగి పనులకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎల్ఎం టీం అధికారి గంగప్ప, అడిషనల్ డీఆర్‌డీఏ స్టీవెన్, ఈజీఎస్ ఇంజనీర్ సైదులు, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంపీఓ షఫీయుల్లా, ఏపీఓ సురేశ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


అంతారంలో వైకుంఠధామాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

నేడు అభయాంజనేయస్వామి జాతర

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని సంఘాయిపల్లి శివారులో స్వయంభూగా వెలిసిన అభయాంజనేయస్వామివారి జాతర మహోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9గంటలకు స్వామివారి పల్లకీసేవ, 11గంటలకు పంచామృత అభిషేకం, సింధూర లేపనం, పుష్పార్చన అలంకరణ, నైవేద్యం, మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



సొంతగూటికి రాకేశ్ మహరాజ్


రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న రాకేశ్

- పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక
- తాండూరులో పార్టీ జెండా ఎగరేస్తామని ధీమా

తాండూరు: దివంగత మంత్రి చందుమహరాజ్ తనయుడు, బషీరాబాద్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాకేశ్‌మహరాజ్ శనివారం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈయన గతంలో బషీరాబాద్ గ్రామ సర్పంచ్‌గా, మండల జెడ్పీటీసీగా కొనసాగారు. 2018లో మహరాజుల కుటుంబానికి పార్టీ అసెంబ్లీ టికెట్ ఇవ్వకపోవడంతో కాంగ్రెస్‌ను వీడారు. ఆతర్వాత సీఎం కేసీఆర్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. కానీ నాలుగేళ్లుగా ఆ పార్టీకి సైతం దూరంగా ఉంటూ వచ్చారు. ఇటీవల ఆయన సోదరుడు, పీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్‌మహరాజ్ కాంగ్రెస్‌లోకి రావాలని రాకేశ్‌ను ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో రమేశ్‌మహరాజ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ధారాసింగ్‌తో కలిసి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిశారు. రాకేశ్‌కు పార్టీ కండువా వేసిన అనంతరం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తాండూరులో మహరాజుల కుటుంబ ఏకమై కాంగ్రెస్‌కు పూర్వవైభవం తేవాలని సూచించారు. రాకేశ్ మాట్లాడుతూ.. తాండూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని తెలిపారు. దశాబ్దాలుగా నియోజకవర్గ ప్రజలు పార్టీని, మహరాజుల కుటుంబాన్ని ఆదరిస్తున్నారని స్పష్టంచేశారు. అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తంచేశారు. వీరివెంట నాయకులు సురేష్‌మహరాజ్, జనార్దన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

అధైర్యపడకండి.. అండగా ఉంటాం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి
- దేవనూరులో శివస్వాముల కుటుంబాలకు పరామర్శ

యాలాల: శివ మాలధారుల కుటుంబాలు అధైర్య పడవద్దని, వారికి అండగా ఉంటామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి హామీ ఇచ్చారు. శనివారం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌కుమార్, పార్టీ నాయకులు నరేశ్ మహరాజ్, జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతు, పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్‌తో కలిసి దేవనూరు గ్రామంలో పర్యటించారు. శివస్వాములపై జరిగిన ఘటన వివరాలను బాధిత కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..శివమాలధారుడి పట్ల గ్రామ యువకుడు దుర్భషలాడి, దాడికి పాల్పడటాన్ని ఖండించారు. ఈ విషయంలో పోలీసులు అధికార పార్టీకి అండగా ఉండి, బీజేపీ నాయకుడు మురళీ కృష్ణగౌడ్‌ను అరెస్టు చేశారని మండిపడ్డారు.

మురళీక్రిష్ణగౌడ్‌తో పాటు రిమాండ్‌పై వెళ్లిన శివస్వాములు నరేందర్, గణేశ్, నరేందర్‌గౌడ్, శివకుమార్, అరవింద్‌గౌడ్‌లను బెయిల్‌పై తీసుకువస్తామన్నారు. పోలీసులు చట్టపరంగా విధులు నిర్వహించకుండా, అధికార పార్టీకి కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేవారు.

ఎమ్మెల్యే రాజాసింగ్ ఫోన్‌లో పరామర్శ

దేవనూరులో జరిగిన ఘటన పట్ల గోషామహాల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఫోన్‌లో బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. జరిగిన ఘటన పట్ల అధైర్యపడవద్దని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. దేవనూరులో జరిగిన ఘటన వివరాలను తాండూరు అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ రజనీకాంత్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్, మాజీ సర్పంచ్ అంజిలయ్య తదితరులు ఉన్నారు.

ఇది సర్కార్ కుట్ర

తాండూరు టౌన్: దళితులను బీజేపీకి దూరం చేయాలని బీఆర్ఎస్ పార్టీ కుట్ర పన్నుతోందని పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి ఆరోపించారు. దేవనూర్‌లో శివస్వాములను దూషించిన ఘటనలో పలువురు స్వాములతో పాటు బీజేపీ నేత మురళీకృష్ణ గౌడ్‌ను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ.. శనివారం పట్టణంలో పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడి ఘటనను పరిష్కరించాల్సిందిపోయి విషయాన్ని పెద్దగా చేశారన్నారు. దీనిపై న్యాయం పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌కుమార్, పట్టణాధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, కౌన్సిలర్ సాహు శ్రీలత, బాలప్ప, నాయకులు రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


యాలాల: దేవనూరులో శివస్వాముల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

ముడిమ్యాల అటవీ ప్రాంతంలో అస్థిపంజరం

చేవెళ్ల: ముడిమ్యాల అటవీప్రాంతంలో ఓ వ్యక్తి అస్థిపంజరం లభించింది. వివరాలిలా ఉన్నాయి. అటవీ ప్రాంతంలో పశువుల కాపర్లకు మనిషి అస్థిపంజరం, బట్టలు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ ప్రదీప్‌కుమార్‌లు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఎముకలను, బట్టలను సేకరించారు. మూడు నెలల కిత్రం ముడిమ్యాలకు చెందిన మన్నంతుల జంగయ్య(70) అదృశ్యం కావడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ అస్థిపంజరం అతనిదే అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఎములకను డీఎన్ఏ పరీక్షకోసం పంపనున్నట్లు పోలీసులు తెలిపారు. పరీక్షల అనంతరం వచ్చిన నివేదికతో ఎవరనేది తెలుతుందని చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బసవన్నల ప్రదక్షిణ

కొడంగల్: పట్టణ శివారులో వెలిసిన బండల ఎల్లమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం బసవన్నలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. రైతులు ఎద్దులను చిన్నపాటి బండ్లకు కట్టి ఆలయం చుట్టూ ఊరేగింపు నిర్వహించారు. కులమతాలకు అతీతంగా రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం ఉదయం ఎడ్లను శుభ్రంగా కడిగి నైవేద్యాలు పెట్టారు. సాయంత్రం ఆలయానికి చేరుకొని ఉత్సవాలు చేశారు. అమ్మవారి ఆలయం ఎదుట పూజలు చేసి బండ్లను ఆలయం చుట్టూ తిప్పారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.


ఎడ్ల బండ్లతో అమ్మవారి ఆలయానికి వెళుతున్న రైతులు

పనిచేయని కెమెరాలు.. సర్వత్రా దిగులు

- దృష్టిసారించని పోలీసులు
- మరమ్మతులు చేపట్టాలని వినతులు

కొడంగల్: పట్టణంలోని పలు చోట్ల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయడం లేదు. ప్రమాదాలు జరిగినా.. చోరీలు జరిగినా నిందితుల గుర్తింపులో జాప్యం జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు దాతల సహకారంతో కొడంగల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానం చేశారు. మండల పరిధిలోని మేజర్ గ్రామాల్లో కూడా సీసీ కెమెరాలను బిగించారు. గ్రామ పోలీస్ అధికారులను నియమించి శాంతి భద్రతలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అయితే గతం నుంచి పోలీస్ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సీసీ కెమెరాల నిర్వహణను పట్టించుకోవడం లేదు. తక్షణం మరమ్మతులు చేపట్టాలంటూ ప్రజలు విన్నవిస్తున్నారు.

మున్సిపల్ పరిధిలో...

మున్సిపల్ పరిధిలోని అంబేడ్కర్ చౌరస్తా, బస్టాండ్ ఆవరణ, జాతీయ రహదారి, వినాయక చౌరస్తా, రషీద్ పాన్ షాపు, గాంధీ నగర్, బాలాజీనగర్, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు, హైవే పోలీస్ స్టేషన్, కొడంగల్ పోలీస్‌స్టేషన్‌తో పాటు ప్రభుత్వ కార్యాలయాల దగ్గర సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని బొంరాస్‌పేట, దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. హైదరాబాద్ – బీజాపూర్ జాతీయ రహదారిపై తుంకిమెట్ల, నాగిరెడ్డిపల్లి, రేగడి మైలారం, రావులపల్లి, చంద్రకల్ గ్రామాల దగ్గర సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. తెలంగాణా కర్నాటక సరిహద్దు గ్రామాల దగ్గర సీసీ కెమెరాలు లేవు. మహబూబ్‌నగర్ – తాండూరు రోడ్డుపై సీసీ కెమెరాలు లేకపోవడంతో ఎప్పుడు ఎక్కడ ఏ ప్రమాదం జరిగినా గుర్తించడం కష్టంగా మారింది. జిల్లాలోని పరిగి, తాండూరు, వికారాబాద్ పట్టణాల్లోని పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉంది. ఆయా నియోజకవర్గాలోని గ్రామాల్లో నిఘా నేత్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది.


అంబేద్కర్ చౌరస్తాలో ఉన్న సీసీ కెమెరా

నాలుగు మాత్రమే పనిచేస్తున్నాయి

కొడంగల్‌లో 50కు పైగా కెమెరాలు ఉన్నాయి. అందులో నాలుగు మాత్రమే పనిచేస్తున్నట్లు అధికారిక వర్గాల ద్వారా తెలుస్తోంది. పట్టణంలో కొత్తగా ఏర్పడిన లాహోటీ కాలనీ, శాంతినగర్ కాలనీ, సన్‌సిటీ కాలనీల్లో ఉద్యోగులు, వ్యాపారులు నివసిస్తున్నారు. ఈ కాలనీల్లో గతంలో వరుస దొంగతనాలు జరిగాయి. ఇప్పటికీ చోరీలు జరుగుతూనే ఉన్నాయి. నిఘా లేకపోవడంతో దొంగలు దొరకడం లేదనే అపవాదు ఉంది. పోయిన సొత్తు రికవరీ కావడం లేదని బాధితులు విమర్శిస్తున్నారు. బొంరాస్‌పేట మండలంలో 8 కెమెరాలు ఉన్నాయి. అందులో ఒకటి మాత్రమే పనిచేస్తోంది. దౌల్తాబాద్‌లో 8 కెమెరాలు ఉన్నా అందులో ఎన్ని పనిచేస్తున్నాయో తెలియని పరిస్థితి ఉంది.

పశువుల దొంగతనాలు..

నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో దొంగలు పశువులను అపహరిస్తున్నారు. గడిచిన నాలుగేళ్లుగా పశువుల దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. ఇంటి ముందు ఉన్న పశువులు కనిపించకపోయే సరికి రైతులు ఆందోళన చెందుతున్నారు. కొడంగల్ మండల పరిధిలోని రుద్రారం, చిట్లపల్లి, హస్నాబాద్ గ్రామాలతో పాటు దౌల్తాబాద్, బొంరాస్‌పేటలో పశువుల దొంగతనాలు జరిగాయి. లక్షల విలువ చేసే ఎద్దులు, ఆవులు, గేదేలు, మేకలను అపహరిస్తున్నారు. దొంగలు పశువులను వాహనాల్లో తీసుకెళ్లి ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ముఠా రోడ్డు పరిసర గ్రామాల్లో రెక్కీ నిర్వహించి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు సమాచారం.


రషీద్ పాన్ దగ్గర పనిచేయని కెమెరా

నిఘా పెంచాం



కొడంగల్ మున్సిపల్ పరిధిలో పోలీస్ నిఘా పెంచాం. రాత్రి వేళల్లో పోలీసులు గస్తీ తిరుగుతున్నారు. మండలంలో పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నాం. దాతల సహకారంతో త్వరలో ఏర్పాటు చేస్తాం. జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నాం.

– రవిగౌడ్, ఎస్ఐ, కొడంగల్

పింఛన్ల కోసం ఎదురుచూపులు

కొడంగల్: ఆసరా పింఛన్ల కోసం వృద్ధులు ఎదురు చూస్తున్నారు. గతంలో ప్రతి నెల మొదటి వారంలో పింఛన్లు వచ్చేవి. ఫింఛన్ల కోసం వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు పడిగాపులు కాస్తున్నారు. ఫింఛన్లు ఎప్పుడు వస్తాయోనని రోజు పోస్టాఫీస్ చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వ అలసత్వం, నిధుల లేమి కారణంగా ప్రతి నెలా ఆలస్యం అవుతోందని విమర్శలు వస్తున్నాయి. మున్సిపల్‌తో పాటు మండల పరిధిలోని 26 గ్రామ పంచాయతీల్లోనూ పెన్షన్‌దారులకు నిరీక్షణ తప్పడం లేదు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

- యువత గొప్ప లక్ష్యాలను ఎంచుకోవాలి
- ఆ దిశగా నిరంతరం కృషి చేయాలి
- భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

చేవెళ్ల: యువత గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించేందుకు ముందుకు సాగాలని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని కేవీఆర్ గ్రౌండ్‌లో నెలరోజులుగా జరుగుతున్న పైండ్ల గోపాల్‌రెడ్డి క్రికెట్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ విజేత ఆలూరు జట్టుకు రూ.60వేల నగదు, షీల్డ్.. రన్నరప్ ఇబ్రహీంపల్లి జట్టుకు రూ.30వేల నగదు, షీల్డ్‌ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. పోటీల్లో గెలుపు, ఓటములు సహజమని.. ఓటమి గెలుపునకు నాందిగా తీసుకోవాలని సూచించారు. ఉత్తమ బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ప్రదర్శించిన క్రీడాకారులకు సైతం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చేవెళ్ల సర్పంచ్ బండారి శైలజ, పీఏసీఎస్ చైర్మన్‌లు డి. వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరంజన్‌రెడ్డి, ఆగిరెడ్డి, సమత, మధుసూదన్‌గుప్తా, శ్రీనివాస్, శ్రీకాంత్, మల్లారెడ్డి, నాగిరెడ్డి, మల్లేశ్, చంద్రశేఖర్, నిర్వాహకులు పాల్గొన్నారు.


విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి